పల్లె రోడ్లు పట్టవా..?

అధ్వానంగా గ్రామీణ రహదారులు

- గుంతలు, కోతకు గురైన రోడ్లతో నరకయాతన
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


కోతకు గురై మరమ్మతులకు నోచుకోని రఘునాథపాలెం బీటీ రోడ్డు

కరకగూడెం: గ్రామీణ రహదారుల వ్యవస్థ మండలంలో అధ్వానంగా తయారైంది. దీంతో పలు గ్రామాల్లో వాగులు, వంకలు, అడవుల గుండా ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ప్రజలు, వాహన దారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారుల నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లు సరిగ్గా లేకపోవడంతో నేటికీ పల్లెలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. గ్రామాలను అభివృద్ధి చేస్తున్నాం, పల్లెలు దేశ ప్రగతికి పట్టుగొమ్మలని తరచూ పాలకులు ఊదరకొడుతున్నా ఆచరణలో వాస్తవిక పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో ఇక అత్యవసర పరిస్థితుల్లో దేవుడి పైనే భారం వేయాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో నెలకొన్న రహదారుల దుస్థితిపై కథనం

వర్షాలతో కోతకు గురైన రోడ్లు..

మండలంలోని వలస ఆదివాసీ గ్రామాల పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో నేటికీ సరైన రహదారులు లేవు. వీటికి తోడు గతేడాది భారీ వర్షాల కారణంగా బీటీ రోడ్లు, కొన్ని చోట్ల ప్రధానరహదారులు సైతం కోతకు గురవ్వడంతో అధికారులు నేటికి వాటిని మరమ్మతులు చేపట్టకపోవడంతో మండల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో గతుకుల రహదారులతో ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉన్నా పాలకులు, అధికార యంత్రాంగం పట్టించుకున్న దాఖలాలు లేవు. రోడ్ల పరిస్థితి ఇలానే ఉంటే రానున్న వర్షాకాలంలో ప్రజలు నానా అవస్థలు పడడం ఖాయమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలు కనీసం ప్రయాణానికి ఇబ్బందిలేని రీతిలో మరమ్మతులకైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రారంభం కాని పనులు..

మండల పరిధిలోని పలు గ్రామాల్లోని కొన్ని రహదారులకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా వాటికి సంబంధించి నేటికీ పనులు ప్రారంభం కాలేదు. మరికొన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి ఎన్‌ఆర్జీఎస్ నిధులతో సుమారు 1 కోటి 15లక్షల వ్యయంతో 23 రోడ్లు మంజూరయ్యాయి. వీటిలో పలు చోట్ల 11 రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన రోడ్ల పనులు కూడా త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసి, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కంకర తేలిన బర్లగూడెం-అల్లేరుగూడెం రహదారి

ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామంలో సరైన రహదారులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చాలా ఏళ్లుగా రోడ్లు ఎలా ఉన్నాయో అలానే ఉన్నాయి. దీంతో మాకు కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా పాలకులు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి చొరవచూపాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దశలవారీగా రోడ్ల నిర్మాణాలకు నిధులు కేటాయించి పల్లెలను అభివృద్ధి పథంలోకి తీసుకురావాలి.

– మొక్కటి సాంబనారాయణ, కొత్తూర్

వెంటనే పనులు ప్రారంభించాలి



మా గ్రామానికి బీటీ రోడ్డు మంజూరైన పనులు నేటివరకు మొదలు పెట్టలేదు. గుంతలు రహదారిలో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బీటీ రోడ్ల పరిస్థితే ఇలా ఉంటే ఇక గ్రావెల్ రోడ్లు, మెటల్ రోడ్లలో ప్రయాణం ఎలా ఉంటుందో అర్థమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు ప్రారంభించి ఇబ్బందులు లేకుండా చూడాలి.

– చందా పూలవతి, వెంకటాపురం

అధికారులు అలసత్వం వీడాలి



గతేడాది కురిసిన భారీ వర్షాలకు మా గ్రామంలోని బీటీ రోడ్డు సగానికి పైగా తెగింది.కానీ నేటి వరకు ఆ రహదారిని పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. దీంతో మాకు ఇబ్బందులు తప్పడం లేదు ముఖ్యంగా రాత్రివేళల్లో ప్రయాణించాలంటే భయంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు అలసత్వం వీడి దెబ్బతిన్న రహదారులను మరమ్మతులు చేయాలి.

– పోలేబోయిన జయబాబు, రఘునాథపాలెం

క్లుప్తంగా

మొదలైన బీటీ ప్యాచ్‌వర్క్


గుంతలను పూడుస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేట: స్థానిక ఖమ్మం రోడ్డులోని జాతీయ రహదారిపై భారీ గుంతలను పూడ్చేందుకు బీటీ ప్యాచ్‌వర్క్‌ను బుధవారం మొదలుపెట్టారు. అశ్వారావుపేటలో జాతీయ రహదారి మరమ్మతుల ఆలస్యంపై సాక్షిలో 'ఇవేం పనులు' శీర్షికన కథనం ప్రచురితం అయింది. కథనానికి స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.

అమ్మవారికి శంకుచక్రాల బహూకరణ


శంకుచక్రాలను అందజేస్తున్న భక్తులు

అశ్వారావుపేట: అశ్వారావుపేట శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి ఏపీలోని ఏలూరుకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు బుధవారం వెండి శంకుచక్రాలను బహూకరణ చేశారు. ఏలూరుకు చెందిన గ్రంధశిరి రామకృష్ణారావు, మాధవి, డాక్టర్ తాడికొండ ప్రవీణ్‌కుమార్, శిరీష, హైదరాబాదుకు చెందిన కోకూరి సాయి నగేష్, ప్రవంతి ఆర్థిక సాయంతో తయారు చేసిన శంకుచక్రాలను ఆలయ కమిటీకి అందజేశారు. చైర్మన్ ముత్తా సుమాకర్, అర్చకులు బుర్రా సత్యమూర్తి, అచ్యుత్ కుమార్ శర్మలకు అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం

మణుగూరు రూరల్ : పట్టణ ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఉమా మహేశ్వరరావు అన్నారు. బుధవారం మున్సిపాలిటీపరిధి అంబేడ్కర్ సెంటర్‌లో ఎంజె మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మున్సిపల్ అధికారులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు బుధవారం వితరణగా అందించారు. నారాయణపురం సొసైటీ చైర్మన్ నిర్మాల పుల్లారావు సొంత ఖర్చులతో వితరణ చేశారు. ఉపాధ్యాయులు హలవత్ హరిబాబు, పూర్వ విద్యార్థులు పడాల నరసింహారావు, చిన్నంశెట్టి నాగేంద్ర కుమార్, పరిటాల సందీప్, ఫణిబాబు, రాము పాల్గొన్నారు.

సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న నాయకులు

అశ్వాపురం: 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలుకు హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని మల్లెలమడుగు పంచాయతీ కాంగ్రెస్ పార్టీ కమిటీ బుధవారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బేతం రామకృష్ణ, నాయకులు ఆవుల రవి, రాగం మల్లయ్య, వెంకటరమణ, వెంకన్న, దేవరపు శ్రీను, సంపత్, దేవంగి వెంకటరమణ, చెన్నయ్య, బాబు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ఠ

మణుగూరు రూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామ పంచాయతీలోని శ్రీ కోదండరామాలయం శ్రీ కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ, శ్రీ మల్లికార్జునస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవిద్యారణ్య భారతి మహాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ కరివేద వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు పుచ్చకాయల శంకర్, సామా శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, కూచిపూడిబాబు, ఆలయ కమిటీ సభ్యుల నాగళ్ల సత్యనారాయణ, మంగి మల్లికార్జున్ పాల్గొన్నారు.

భద్రాద్రి అభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన చేయాలి


మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం అభివృద్ధిపై స్పష్టమైన ప్రకటన చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. బుధవారం పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన పార్టీ భద్రాచలం పట్టణ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాచలం అభివృద్ధిపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం ధోరణి అవలంభించడంతో అభివృద్ధి జరగలేదన్నారు. కరకట్ట ఎత్తు పెంచి పొడిగించి పటిష్టపరిచేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, భద్రాచలంకు ఆనుకొని ఉన్న ఐదు పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు ఆంధ్రప్రదేశ్, కేంద్ర ప్రభుత్వాలతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. భద్రాచలం ఆలయభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌పై సర్వే చేసి స్పష్టతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై వెంకటరామారావు, నాదెళ్ల లీలవతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెంకట్రావు తీరు సరికాదు..

దుమ్ముగూడెం: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య విషయంలో చేసిన వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని లక్ష్మీపురంలో ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశాక శ్రీనివాసరావు మాట్లాడుతూ... భద్రాచలం అభివృద్ధి కోసం వీరయ్య ఏమీ చేయలేదని వెంకట్రావు అనడం గర్హనీయమన్నారు. నాయకులు దర్శి సాంబశివరావు, పిలక వెంకటరమణరెడ్డి, కనుబుద్ధి దేవా, తోటమల్ల సుధాకర్, గుమ్మడి శ్రీను, కుర్సం మారయ్య రమేష్, వెంకయ్య చౌదరి, మద్ది సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యను పక్కదారి పట్టించొద్దు..

భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేయడం సరికాదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గత ఎమ్మెల్యే పొదెం వీరయ్య అప్పటి సీఎం కేసీఆర్‌ను కలవకపోవడంతోనే నిధులు మంజూరు కాలేదని, ఈ విషయం తెలిసినా తప్పుడు ఆరోపణలు చేస్తూ సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మతో పాటు కణితి రాముడు, జానీపాషా, దామెర్ల శ్రీనివాస్, నోముల రామిరెడ్డి, మడకం రామారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించడం తగదు

భద్రాచలంటౌన్: ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ దిష్టి బొమ్మను తగులబెట్టి ఆయనపై విమర్శలు చేయడం కాంగ్రెస్ నాయకులకు సరికాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అరికెళ్ల తిరుపతిరావు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సీఎంతో పాటు మంత్రులను కలిస్తే నాయకులు జీర్ణించుకోవడం లేదని విమర్శించారు. కార్యదర్శి కొండిశెట్టి కృష్ణమూర్తి, రత్నం రమాకాంత్, రాజీవ్, సునీల్, శ్రీనివాస్, రాజు, విజయ్ ఉన్నారు.

వీరయ్యను విమర్శించడం సరికాదు

పొదెం వీరయ్యను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ విమర్శించడాన్ని కాంగ్రెస్ డివిజన్ నాయకులు తీవ్రంగా ఖండించారు. స్థానిక వీరయ్య నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో టీపీసీసీ సభ్యుడు, ఎల్‌డీఎం కో ఆర్డినేటర్ నల్లపు దుర్గాప్రసాద్, మండలాధ్యక్షుడు సరేళ్ల నరేష్ మాట్లాడారు. నాగ సతీష్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ గౌడ్, చలపతి, తమ్మళ్ళ వెంకటేశ్వర్లు, వెంకటేష్, సుధీర్ పాల్గొన్నారు.

వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

పొదెం వీరయ్యపై ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డివిజన్ యూత్ కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ సెంటర్‌లో ఎమ్మెల్యే దిష్టి బొమ్మను దహనం చేశారు.

హక్కుల కోసం పోరాడుదాం..

గుండాల: కేంద్ర ప్రభుత్వం మహిళల నిర్ణయాధికారాన్ని కాలరాసే పితృస్వామ్య భావజాలాన్ని పెంచి పోషిస్తుందని, హక్కుల కోసం ప్రతీ ఒక్క మహిళ పోరాటాలకు సిద్ధం కావాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె రామక్క, రాష్ట్ర నాయకురాలు వై.జానకి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఈనెల 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ కల్తి రాజేశ్వరి, యాసారపు వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ కోరం సీతారాములు, మాజీ ఉప సర్పంచ్ మానాల ఉపేందర్, నరేష్, వెంకన్న, లాలయ్య, అజ్గర్, లాలు, క్రిష్ణ, పాయం ఎల్లన్న, మల్లేష్, పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో మహిళల హక్కులకు భంగం

బూర్గంపాడు: కేంద్రంలోని బీజేపీ పాలనలో మహిళల హక్కులకు భంగం కలుగుతుందని ప్రగతిశీల మహిళ సంఘం(పీఓడబ్ల్యూ) డివిజన్ కార్యదర్శి సున్నం భూలక్ష్మి అన్నారు. చింతలలక్ష్మీనగర్‌లో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. బండ్ల కమల, కృపారాణి, అచ్చెమ్మ, నర్సమ్మ, బతుకమ్మ, చంద్రకళ పాల్గొన్నారు.


గుండాల: ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు


బూర్గంపాడు: పోస్టర్లు విడుదల చేస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

'నారీ శక్తి వందన్' కార్యక్రమం


కార్యక్రమానికి హాజరైన మహిళలు

అశ్వారావుపేటరూరల్: 'నారీ శక్తి వందన్ అభియాన్'లో భాగంగా బుధవారం జరిగిన ప్రధాని మోదీ వర్చువల్ కార్యక్రమం విజయవంతమైంది. స్థానిక ఓ ప్రైవేటు లాడ్జీ ఆవరణలో జరిగిన వర్చువల్ సమావేశానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరు కాగా, ప్రధాని మోదీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, ప్రత్యేక బిల్లులతోపాటు ఇతర సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు ములసయ్య, పోలయ్య, అశ్వారావుపేట అసెంబ్లీ కన్వీనర్ గోట్టిపూళ్ల శ్రీనివాస్, నాయకులు ఎస్‌వీటీ కొండ, చెన్నారావు, శ్రీనివాస్, బాల కిరణ్, చంద్రశేఖర్, శివ కుమార్, కే కృష్ణ, అరవింద్, వెంకన్నబాబు, బీ శ్రీను, మద్దాల దేవి, లక్ష్మీ పాల్గొన్నారు.

రద్దు చేసిన రైళ్లన్నీ పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న నాయకులు

మణుగూరు రూరల్/ మణుగూరు టౌన్: కరోనా సమయంలో రద్దు చేసిన రైల్వే సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ పార్టీ స్థానిక కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ... ప్రస్తుతం మణుగూరు నుంచి ఒకే రైలు సర్వీస్ మాత్రమే సికింద్రాబాద్‌కు ప్రయాణించడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మీనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి సుధాకర్, ఏఐటీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఎం.రాంనర్సయ్య, నాయకులు ఆవుల నాగరాజు, సురేందర్, వెంకటేశ్వర్లు, సీతారాములు, రాములు పాల్గొన్నారు.

'రైతునేస్తం' ప్రారంభం

బూర్గంపాడు: రైతుల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు, అధికారులు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

మహిళా సాధికారతతోనే పురోగతి

- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరు రూరల్ : మహిళా సాధికారతతోనే దేశ ప్రగతి పురోగతి సాధ్యమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని గుట్టమల్లారం గ్రామంలోని రైతువేదిక వద్ద మొల్ల స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కవయిత్రి మొల్లమాంబ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో మహిళలు పురుషుల కంటే ధీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉంటుందన్నారు. సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి మహిళా సంక్షేమమే ధ్యేయంగా ఆరు గ్యారంటీ పథకాల్లో మహిళలకే ప్రాధాన్యతనిచ్చారన్నారు. అనంతరం వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలందిస్తున్న పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకురాళ్లు, ఉద్యోగినులు, మహిళలు, స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సన్మానం అందుకున్న మహిళలతో ఎమ్మెల్యే పాయం, తదితరులు

అన్ని వేళల్లో అండగా ఉంటా..

- ఎమ్మెల్యే జారె ఆదినారాయణ


వీడియో కాన్ఫరెన్స్ సిస్టంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

ములకలపల్లి: నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళల్లో అండగా ఉంటానని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. మండలవ్యాప్తంగా బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. తిమ్మంపేటలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. స్థానిక పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. అదేవిధంగా కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. పలుగ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లిన ఎమ్మెల్యే చెక్కలను అందజేశారు.

రైతునేస్తం .. అన్నదాతకు వరం

రైతునేస్తంతో రైతువేదికలను వీడియో కాన్ఫరెన్సింగ్‌కు అనుసంధానం చేయడం అన్నదాతకు వరం అని ఎమ్మెల్యే ఆదినారాయణ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ సిస్టంను రిబ్బన్ కట్‌చేసి లాంఛనంగా ప్రారంభించారు. తహసీల్దార్ పుల్లారావు, ఎంపీడీఓ భారతి, ఎంఎఓ కరుణామయి, సాయి, ఎంపీఓ లక్ష్మయ్య, చిలకపాటి జైచందర్‌రావు, కరుటూరి కృష్ణ, అనుమల నర్సింహారావు పాల్గొన్నారు.

చదువును నిర్లక్ష్యం చేయొద్దు..

ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యను నిర్లక్ష్యం చేయొద్దని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను ప్రారంభించి, మొక్క నాటారు. అనంతరం క్రీడలు, విద్యలో చక్కటి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ సునీత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, ఎంపీటీసీ సున్నం సునిత, మాజీ సర్పంచ్ కారం సుదీర్, గాడి తిరుపతిరెడ్డి, గుంపుల రవితేజ, సర్దార్, శనగపాటి రవి. సురభి రాజేశ్, ఆదిత్య, ఏఈలు లక్ష్మీనర్సింహారావు, వరప్రసాద్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలి

కరకగూడెం: తునికాకు సేకరణకు సంబంధించి టెండర్లు వెంటనే పిలిచి, ప్రూనింగ్ పనులు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు చెర్ప సత్యం, కొమరం కాంతారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్‌లో తహసీల్దార్ నాగప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతీ ఏటా డిసెంబర్, జనవరి నుంచే సేకరణ ప్రక్రియకు సంబంధించిన పనులను అటవీశాఖ మొదలు పెట్టేదని ఈ ఏడాది మాత్రం ఆ ప్రక్రియ నత్తనడకను సాగుతున్నదని ఇప్పటివరకు టెండర్ల ప్రక్రియనే పూర్తవ్వలేదన్నారు.

ములకలపల్లి : తునికాకు సేకరణ టెండర్లు వెంటనే నిర్వహించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం ములకలపల్లిలోని అటవీ రేంజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి రేంజ్ ఆఫీసర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గౌరి నాగేశ్వరరావు, నాయకులు వెంకటేశ్వర్లు, రవికుమార్, రావూజా, జగ్గు, లక్ష్మీనర్సయ్య, సీతారాములు పాల్గొన్నారు.


ములకలపల్లి : ధర్నా చేస్తున్న నాయకులు


కరకగూడెం: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సన్మార్గంలో నడిస్తేనే జీవితానికి సార్థకత


మసీదు ప్రారంభ కార్యక్రమంలో ముస్లింల ప్రార్థనలు

చర్ల: సన్మార్గంలో నడిస్తేనే మనిషి జీవితానికి సార్థకత ఉంటుందని ప్రముఖ ముస్లిం గురువులు అన్నారు. మండల కేంద్రమైన చర్లలో మజ్జిద్-ఎ-నూరల్ – హుదా పేరుతో నూతనంగా నిర్మించిన మసీదును బుధవారం ముస్లిం మత గురువులు ప్రత్యేక ప్రార్థనల నడుమ ప్రారంభించారు. ఈ సందర్భంగా మత గురువులు హజ్రత్ మౌలానా సయ్యద్ మజ్హర్ సాహబ్ ఖీస్మీ, హజ్రత్ మౌలానా అబ్దుల్ కరీమ్ సాహబ్ రషాదీ, జనాబ్ అఫ్రోజ్ సాహబ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ ఎడ్యుకేషన్ అకాడమీ వ్యవస్థాపకులు ముహమ్మద్ అబ్దుల్ లతీఫ్ ఖాన్ సాహబ్ వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లింలు పాల్గొన్నారు.

భోజన కార్మికులకు వేతనాలు చెల్లించాలి

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు, బిల్లులను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ కోరారు. బుధవారం అశ్వారావుపేటలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఈ నెల 11 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు సమ్మె నోటీసును ఎంఈఓ కృష్ణయ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నన్ని, యామిని, నాగదుర్గ, సీత, దేవి, వెంకమ్మ, సత్యవతి లీలా తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు


బూర్గంపాడు: విద్యుత్ కాంతులలో నాగినేనిప్రోలులోని శివాలయం


చర్లరూరల్: ముస్తాబవుతున్న తేగడలోని వీరభద్ర స్వామి ఆలయం

బూర్గంపాడు: శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. మోతెగడ్డ వీరభద్రస్వామి ఆలయం, నాగినేనిప్రోలులోని శివాలయం, బూర్గంపాడులోని ఉమామహేశ్వర ఆలయాలను శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేశారు. గురు, శుక్ర, శనివారాలలో స్వామివారి కల్యాణోత్సవాలు, ఊరేగింపులు ఘనంగా నిర్వహించనున్నారు.

చర్లరూరల్: మహా శివరాత్రికి చర్ల మండలంలోని శైవ క్షేత్రాలు ముస్తాబవుతున్నాయి. మరో రెండు రోజుల్లో మహా శివరాత్రి పర్వదినం ఉండడంతో చర్లలోని శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం, కలివేరులోని ఉమాస్వయంభు శివలింగేశ్వర స్వామి ఆలయం, తేగడ లోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయాలు కల్యాణ మహోత్సవం కోసం ముస్తాబవుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకోసం ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలను అలంకరిస్తున్నారు. తేగడలోని వీరభద్ర స్వామి ఆలయంలో నారసాల సంబరం,పాగోళ్ళ సంబరంతో పాటు ఇక్కడకు ప్రత్యేకంగా వీర ప్రభలను చూసేందుకు భద్రాచలం డివిజన్, పరిసర ప్రాంతాలు, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌లోని అనేక దూర ప్రాంతాల నుంచి తేగడలో జరిగే శ్రీ వీరభద్ర స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు రానుండడం విశేషం.